
శ్రీశ్రీశ్రీ సీతారామ కల్యాణమహోత్సవ
ధర్మారావుపేటలో సీతారాముల కల్యాణం

కల్యాణం.. కమనీయం..

- ఊరూరా సీతారాముల కల్యాణాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేత


బెల్లంపల్లి రైల్వేస్టేషన్ రామాలయంలో కల్యాణం

ఏసీసీ, ఏప్రిల్ 17: జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత మంచిర్యాల రామాలయం, శివాలయంలో నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు పాల్గొన్నారు. ఆలయానికి రూ.2 లక్షలు విరాళంగా ప్రకటించి లక్ష రూపాయల నగదు అందించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఉప్ప లయ్య, తిరుపతి, చంద్రశేఖర్, సునీతకిషన్ పాల్గొన్నారు. గౌతమినగర్‌లోని కోదండరామాలయం, విశ్వనాథ ఆలయాల్లో నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు. పాతమంచిర్యాలలో నిర్వహించిన కల్యాణానికి మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. దివాకర్‌రావు సతీమణి రాజ కుమారి, తనయుడు విజిత్‌రావు, పెంట రాజయ్య పాల్గొన్నారు. విశ్వనాథ ఆలయంలో బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పాల్గొన్నారు. మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో పెద్దపల్లి ఎంపీ బీజేపీ అభ్యర్థి గోమాసశ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు గెలిస్తే పాత మంచిర్యాలలోని రామాలయం శివాలయం, భక్తాంజనేయస్వామి ఆలయం లో అంజనేయ స్వామి విగ్ర హానికి వెండి తొడుగు, టైల్స్ అందిస్తామని కాంగ్రెస్ పట్ట ణాధ్యక్షుడు తూముల నరేష్‌జమునరాణి, సింగిల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేష్ స్రవంతిలు మొక్కుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో వాటిని అందించారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కోదండరామాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కోదండ రామాలయంలో జరిగిన కల్యాణంలో మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. రైల్వే కాలనీలోని రామాలయంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

జైపూర్: హనుమాన్‌ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్ దంపతులు హాజరై తాళి, మట్టెలు అంద జేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

దండేపల్లి: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహలను ఊరేగిం పుగా ఆలయాలకు తీసుకవచ్చి కల్యాణం జరిపించారు. గూడెం సత్యనారా యణస్వామి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, అన్నదానం ఏర్పాట్లు చేశారు.

నస్పూర్: నస్పూర్, సీసీసీ, గోదావరి కాలనీ, నస్పూర్ కాలనీ, తీగల్‌పహాడ్, వినూత్న కాలనీ, ఫ్లడ్ కాలనీ కళ్యాణ మహోత్సవాలను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీలు దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో కల్యాణాలను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ దర్శించారు. నాగార్జునకాలనీ వెంకటేశ్వర దేవాలయంలో నిర్వహించిన కల్యాణంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. కల్యాణం సందర్భంగా అన్నదానాలు జరిగాయి.

మందమర్రిటౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగాయి. మూడో జోన్‌లోని సీతారాముల ఆలయంలో ఏర్పాటు చేసిన మండపం వద్దకు విగ్రహాలను తీసుకువచ్చారు. పెండ్లి పెద్దలుగా కేకే 5గని రక్షణాధికారి రమేష్ దంపతులు, ఏఐటీ యూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ దంపతులు వ్యవహ రించారు. ఎమ్మెల్యే దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన కల్యాణంలో ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. యాపల్ ఏరియాలోని పంచముఖ ఆంజనేయ ఆలయం, కోదండరామాలయంలో కల్యాణానికి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయానికి కూడా వెళ్లి కల్యాణానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు బండి సదానందం యాదవ్ ఎమ్మెల్యే వివేక్ దంపతులను సన్మానించారు. మూడో జోన్‌లోని సీతారామ ఆలయంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్య లక్ష్మి ఓదెలు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కల్యాణంలో కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. సీతారాములకు తలంబ్రాలు అందించారు. సీఐ శశిదర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారాముల ఆశీస్సులు ప్రభుత్వంతోపాటు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి ఐదు గ్యారంటీలను అమలు వేసి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

చెన్నూరు: పట్టణంలోని పంచముఖి హనుమాన్, అయ్యప్ప స్వామి ఆలయం, బడా హనుమాన్ ఆలయాలతో పాటు సుద్దాల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు అక్కెపల్లి, ముత్తరావుపల్లి, ఆస్నాద గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను శోభా యాత్రగా ఆలయాలకు తీసుకువెళ్లి పట్టు వస్త్రాలను ధరింపజేసి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ దంపతులు సుద్దాల, ఆస్నాద గ్రామాల్లోని సీతారాములను దర్శించుకొన్నారు. విశాక చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుద్దాలలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. హేమంత్ రెడ్డి, సుశీల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి, కొల్లూరు, పంగిడిసోమారం, మల్లం పేట, కొండంపేట, షెట్‌పల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తవడ్ల బ్రహ్మయ్యశాంత దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. చలువ పందిళ్లు, తాగు నీరు, అన్నదానం నిర్వహించారు. కోటపల్లి, మల్లంపేట, కొండంపేటలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేక్, జెడ్పీ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు ఆలూరి సంపత్, రాంరెడ్డి, మహేష్, ప్రసాద్ తివారీ రాజ మల్లగౌడ్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఆలయాల ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీరాముడి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. సాయంత్రం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.

వేమనపల్లి: వేమనపల్లి, నీల్వాయి, మంగెనపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీల్వాయి జరిగి న కల్యాణంలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. వేమనపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణు మాధవ్‌రావు పాల్గొన్నారు. కళ్యాణానికి ముందు శోభాయాత్ర నిర్వహించారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. భద్రాచలం నుంచి వచ్చిన ముత్యాల తలంబ్రా లతో మందమర్రి జీఎం మనోహర్ దంపతుల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు కల్యాణాన్ని తిలకించారు. ప్రధాన అర్చకులు అంబాప్రసాద్‌శర్మ, చక్రవర్తిశర్మల ఆధ్వ ర్యంలో కల్యాణం నిర్వహించారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కల్యాణంలో పాల్గొన్నారు. అమర వాదిలో జరిగిన కల్యాణంలో ఎమ్మెల్యే వివేక్ దంపతులు పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, రాజయ్యలు పాల్గొన్నారు. క్యాతన్‌పల్లి క్రాస్ రోడ్డు అభ యాంజనేయ స్వామి ఆలయం వద్ద అర్చకులు పురుషోత్త మచార్యులు కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. గద్దెరా గడి అమ్మ గార్డెన్ వద్ద కల్యాణంలో వివేక్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

భీమారం: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చేకుర్తి సత్యనారాయణరెడ్డి పట్టు వస్త్రాలను సమ ర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వివేక్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు మజ్జిగ, అన్నదానం నిర్వహించారు. పోతనపల్లి, బూరుగు పల్లి, కాజిపల్లి, మద్దికల్, నర్సింగాపూర్ గ్రామాల్లోని అభ యాంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణాన్ని నిర్వహిం చారు. సాయంత్రం గ్రామాల్లో శోభాయత్ర నిర్వహించగా మహిళలు కోలాటాలు ఆడారు.

తాండూర్: ఐబీ భక్తాంజనేయ స్వామి ఆలయం, మాదా రంలోని కోదండరామాలయం, కొత్తపల్లి, బోయపల్లి గ్రామా ల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగిం ది. తాండూర్, ఐబీ ప్రాంతాలకు చెందిన హనుమాన్ స్వా ములు, భక్తులు ఐబీ కేంద్రంలో శోభాయాత్ర నిర్వహిం చారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నెన్నెల: నెన్నెల, ఆవడం, మైలారంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన వీధుల గుండా ఉత్సవమూర్తులతో శోభా యాత్ర నిర్వహించారు. హనుమాన్ దీక్షలో ఉన్న భక్తుల రామనామ స్మరణతో మందిర ప్రాంగణాలు మార్మోగాయి.

కాసిపేట: దేవాపూర్, సల్పలవాగు, ధర్మారావుపేట, కోమ టిచేను, రేగులగూడెం, ముత్యంపల్లి, దుబ్బగూడెం గ్రామా ల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ధర్మారావుపేటలో కొక్కిరాల సత్యపాల్‌రావు దంపతులు కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మాలను నిర్వహించారు.

మందమర్రిరూరల్: చిర్రకుంటలో మాజీ ఉపసర్పంచు ఎనగందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు.

కన్నెపల్లి: మండలంలో సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. జన్కాపూర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో మున్నూరు కాపు సంఘం సభ్యుడు శ్రీనివాస్ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

జన్నారం: పొనకల్, తిమ్మాపూర్, రేండ్లగూడ గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. తిమ్మాపూర్‌లో జరిగిన కల్యాణానికి బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.


మందమర్రిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్


మందమర్రిలో పట్టువస్త్రాలు తీసుకు వస్తున్న ఎమ్మెల్యే వివేక్ దంపతులు


బెల్లంపల్లి కోదండరామాలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి దంపతులు


రామకృష్ణాపూర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు


సుద్దాలలో కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు


మందమర్రిలో పట్టువస్త్రాలు తీసుకువస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


నస్పూర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు


బెల్లంపల్లిలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


విశ్వనాథ ఆలయంలో పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


రేండ్లగూడలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నస్పూర్ వెంకటేశ్వర ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ఎంపీ అభ్యర్థి వంశీ


తాండూర్ ఐబీలో శోభాయాత్ర

ప్రభుత్వ భూములు కబ్జా

- రాత్రికి రాత్రే వెలసిన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు


మంచిర్యాలలో ప్రభుత్వ స్థలంలో వెలిసిన షెడ్లు, ప్రహరీ

మంచిర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సర్కారు భూములు అన్యాక్రాంతం అవుతున్నా అడిగే వారు కరువయ్యారు. రాత్రికి రాత్రే స్థలాన్ని చదును చేసి నిర్మా ణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడం అను మానాలకు తావిస్తోంది. పట్టణ నడిబొడ్డున కార్మెల్ స్కూల్ వెనుక వైపు, రాళ్లవాగు ఒడ్డున ఈ తతంగం కొద్ది రోజులుగా జరుగుతోంది. రాళ్లవాగు సమీపంలో సుమారు 15 ఎకరాల్లో ఇనామ్ భూములున్నాయి. ఈ భూములను ఆనుకొనే సర్వే నెంబరు 283లో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే సర్వే నెంబరు 283/1 లో 1.32 ఎకరాల లావుని పట్టా భూమి ఉంది.

నాలుగేళ్ల క్రితమే చేతులు మారిన భూమి...

సర్కారు భూమి సర్వే నెంబరు 283/3గా విభజిస్తూ నాలుగేళ్ల క్రితమే చేతులు మారింది. 2019లో అందులోని 1.25 ఎకరాలను కొందరు నాలా (వ్యవసాయేతర భూమి) కన్వర్షన్ కోసం దరఖాస్తు చేయగా అప్పటి అధికారులు అనుమతులు జారీ చేశారు. స్థానికుల ఫిర్యాదుతో సదరు స్థలంలో సర్వే నిర్వహించిన అధికారులు చట్ట విరుద్ధంగా నాలా కన్వర్షన్ చేశారని పేర్కొంటూ దరఖాస్తుదారులకు ఫీజుల రూపేణ రూ.10 లక్షల వరకు జరిమానా విధిం చారు. స్థలం చుట్టూ బౌండరీలు ఏర్పాటు చేశారు. అనంత రం హద్దురాళ్లను దాటి మరోకసారి అక్రమ నిర్మాణాలు వెలిశాయి. స్థానికుల ఫిర్యాదుతో అప్పటి అధికారులు ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. తాజాగా రెండు రోజుల క్రితం మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. భూమిని చదును చేసి, తాత్కాలిక షెడ్లు నిర్మించడంతోపాటు ప్రహరీలు నిర్మించి ఆక్రమించారు. భూముల్లో నిర్మాణాలు చేపట్టిన వారు సర్వే నెంబరు 282 అని చెబుతుండగా, ధరణి పోర్టల్‌లో నోషనల్ ఖాతా ఇళ్ల స్థలాలుగా ఉంది. ఇదిలా ఉండగా సర్వే నెంబరు 283కి సంబంధించిన భూమి నిషేధిత జాబితాలో ఉండగా, పక్క సర్వే నెంబరు పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు సమాచారం.

చదరపు గజం రూ. 15 వేలు పైమాటే...

సర్వే నెంబరు 283లో ఉన్న 14 ఎకరాల భూములు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చదరపు గజం ఒక్కంటికి రూ.15వేలు పై చిలుకు పలుకుతోంది. పట్టణ నడిబొడ్డున, చుట్టూ నివాస గృహాలు ఉండటంతోపాటు భూమి ఖాళీగా ఉండటంతో కబ్జాదారుల కళ్లు దానిపై పడుతున్నాయి. గతంలో నిర్మాణాలు చేపట్టగా స్పందించిన రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. అయినా అధికారుల కళ్లుగప్పి రాత్రికి రాత్రే కబ్జా చేయడం ఆనవాయితీగా మారింది. ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా స్పందించి కబ్జాలను తొలగించడం వరకే అధికారులు పరిమితం అవుతుండగా, స్థలాన్ని కాపాడేందుకు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కబ్జా కోరులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు స్థలాన్ని రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా ఎండు మిర్చి అమ్మకాలు


దండేపల్లి, ఏప్రిల్ 17: ఎండు మిర్చి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇంట్లో వంటకు అవసరమయ్యే కారంపొడిని యేడాదికి సరిపడేలా నిల్వ చేసుకుంటారు. దండేపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో జరిగే వారసంతల్లో ఎండుమిర్చి విక్రయిస్తున్నారు. వివిధ ప్రాంతల నుంచి వ్యాపారులు కోను గోలు చేసి వారసంత, ఆటో ద్వారా గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తు న్నారు. మండలకేంద్రంలో కిలోరూ.150 నుంచి 240 వరకు విక్రయించారు.



తాటి ముంజలకు గిరాకీ



నస్పూర్, ఏప్రిల్ 17: నస్పూర్ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన పలు చోట్ల తాటిముంజల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు వాటిపై ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో వంద రూపాయలకు మూడు కాయలు విక్రయిస్తున్నారు. ఆరోగ్యంతో పాటు చల్లదనం కలిగే ముంజలకు గిరాకీ పెరిగింది. ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాదారులు కొనుగోలు చేస్తున్నారు.





















బూర్గుడలో ఈదురుగాలుల బీభత్సం

● బోల్తా పడినలారీ ● ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు ● విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు, చెట్లు



బూర్గుడలో విరిగి పడ్డ విద్యుత్ స్తంభం, ఎగిరి పోయిన దాబా పైకప్పు రేకులు, బోల్తాపడిన లారీ

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 17: మండలం లోని బూర్గుడగ్రామంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు వీచడంతో ఇంటిపైకప్పులు లేచిపోయాయి. విద్యుత్‌స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలోని గాజుల పెంటయ్య, చిగురు గోపాల్, పూదరి పెంటక్క, బుజారి బొడ్డు, ధర్ని రమేష్, ఎరువోతు వినోద్, పులగం శంకర్, దాడి రగులయ్య ఇంటి పైకప్పులు గాలికి లేచిపోయాయి. అనంతరం కురిసిన చినుకులకు వారి ఇంట్లోని నిత్యావసరాలు తడిసిపోయాయి. గాలికి లేచి వచ్చిన రేకులు తగలడంతో పూదరి చంద్రయ్య అనే రైతు ఎద్దు కాలు విరిగింది. అలాగే పూదరి పెంటక్క అనే వృద్ధురాలిపై రాయిపడి గాయాలు కాగా లొకండే చిన్నక్కపై చెట్టు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రహదారి పక్కనే నిలిపిఉన్న ఒకలారీ గాలికి బోల్తా పడింది. రహదారిపక్కన ఉన్న దాబా హోటల్ పైకప్పు రేకులు లేచి పోయి పొలాల్లో పడ్డాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కౌటగూడలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని కౌటగూడలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గెడం లక్ష్మణ్ కుటుంబీకులు బుధవారం ఉదయం ఇంట్లో దీపం పెట్టి గుడికి వెళ్లారు. అనంతరం ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకుంది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో లీడింగ్ ఫైర్‌మెన్ సంపత్ సిబ్బంది గ్రామానికివెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదంలో తులం బంగారం, ఒక బంగారు నెక్లెస్, రూ.2లక్షల నగదు, 10తులాల వెండి, నిత్యవసర సరుకులు కాలిపోయాయి.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17: అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో ఫైర్‌సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీడింగ్ ఫైర్‌మెన్ సంపత్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్యసిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది మహేష్, నర్సింగరావు, తులసీదాస్, రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆదివాసీల చర్చా

బెజ్జూరు, ఏప్రిల్ 17: మండలకేంద్రంలోని కుమరంభీం భవనంలో ఈనెల19న ఆదివాసీలు వారి సమస్యలపై చర్చా వేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల జిల్లా నాయకుడు సోయం చిన్నయ్య, మండల నాయకులు రాజారా, ఎలాది నారాయణతో కలిసి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చల్లో ముఖ్య అతిథులుగా గోండువానా గోండు మహాసభ జాతీయనాయకుడు సిడాంఅర్జు మాస్టర్, గోండువానా రాయ్ సెంటర్ చర్చాగోష్టి జిల్లానాయకుడు మోతీరాం హాజరు కానున్నట్లు తెలిపారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం మండలంలోని నార్‌పటేల్, సార్‌పటేల్ తదితరవర్గాల వారు ఈ చర్చల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



పాఠశాల ప్రిన్సిపాల్, మేనేజర్‌లపై కేసు నమోదు

దండేపల్లి, ఏప్రిల్ 17: హనుమాన్ దీక్షలో ఉన్న బాలస్వాములను అవమానపర్చిన కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల మేనేజర్ జైసన్, ప్రిన్సిపాల్ జోబిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వరూపరాజ్ పేర్కొన్నారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఇటీవల హనుమాన్ దీక్షలు స్వీకరించారు. మాలధారణలతో పాఠశాలకు రావడంతో వారిని స్కూల్ యూనిఫాం వేసుకొని వస్తేనే పరీక్షలు రాయనిస్తామని తరగతి గది బయట నిలబెట్టడం వివాదానికి దారి తీసింది. మంగళవారం హనుమాన్ దీక్షపరులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాల మేనేజర్, ప్రిన్సిపాల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



మౌనిక (ఫైల్)

కాసిపేట, ఏప్రిల్ 17: కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక (28) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఉదయం స్లాబ్‌పై ఉన్న నీళ్ల ట్యాంకులో నుంచి నీరు రాలేదు. ట్యాంకులో నీరు చూడడానికి నిచ్చెన సహాయంతో స్లాబ్ ముందు ఉన్న రేకులపైకి ఎక్కగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. మౌనిక కొడుకు గౌతమ్ ఇంటి పక్కన ఉన్న భవనంపై ఆడుకుంటూ రేకులపై తల్లి పడి ఉండడాన్ని గమనించి పెద్దనాన్నకు సమాచారం అందించాడు. కుటుంబీకులు మౌనికను కిందకు దించేందుకు రేకులపైకి ఎక్కగా వారికీ కరెంటు షాక్ తగిలింది. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మౌనికను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. రేకులషెడ్డు కింద ఉన్న వైర్ ఇన్సులేషన్ తెగిపోయి రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో మౌనిక విద్యుత్ షాక్‌తో మృతి చెం దింది. మృతురాలుకు భర్త రాజేష్, కొడుకు గౌతమ్ ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కొండగట్టుకు పాదయాత్ర

కోటపల్లి, ఏప్రిల్ 17: కోటపల్లి మండల కేంద్రానికి చెందిన 14 మంది మాలధారణ భక్తులు బుధవారం సాయంత్రం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. మూడు రోజులపాటు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకోనున్నట్లు తెలిపారు. పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ భక్తులకు మంగళహారతులు,ప్రత్యేక పూజలతో కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.

అంజన్న సేవలో న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం వేములవాడ, సిరిసిల్లా, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీన్‌కుమార్, హేమలత, స్వాతి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

బటర్ మిల్క్ పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో 300 మందికి బటర్ మిల్క్ ప్యాకెట్లను ఇండియాన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ ప్యాట్రస్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మహేందర్, సత్యపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్ వర్మ,సత్యనారాయణ, మాధవి, మౌనిక, శైలజ, తిరుపతి, మణికంఠ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగంలో డాక్టరేట్



రాజేంద్రకుమార్

జన్నారం, ఏప్రిల్ 17: జన్నారం మండలం పొనకల్ పంచాయతీలోని అక్కపెల్లిగూడెంకు చెందిన జాడి రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్ వచ్చింది. ఉస్మానియా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ శ్రీనునాయక్ పర్యవేక్షణలో ఫార్ములేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రోరిటెంటివ్ డ్రగ్ డెలివరీ సిస్టం అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. కుటుంబీకులు, స్నేహితులు, గ్రామస్థులు అతడిని అభినందించారు.

44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో బుధవారం 44.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉండటంతో వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కోటపల్లి మండలంలో అత్యధికంగా 44.0 డిగ్రీలు, భీమిని మండలంలో 42.8, చెన్నూరు మండలంలో 43.7, కాసిపేట మండలంలో 43.6, దండేపల్లి మండలంలో 43.4, భీమారం, నస్పూర్ మండలాల్లో 43.3, హాజీపూర్ మండలంలో 42.9, జన్నారంలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

జన్నారం, ఏప్రిల్ 17: మండలంలోని పొనకల్, బాదంపల్లి, రేండ్లగూడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. ధాన్యంలో మట్టిబెడ్డలు, రాళ్లు లేకుండా కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. ఆయన వెంట ఏవో సంగీత, ఏఈవో త్రిసంధ్య, పీఏసీఎస్ సీఈవో రాజన్న , రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రమేష్

భీమారం, ఏప్రిల్ 17 : కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా భీమారం మండలానికి చెందిన షెడంశెట్టి రమేష్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ బుధవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి నియామక పత్రం అందించారు.

వైద్య శిబిరం

బెల్లంపల్లి, ఏప్రిల్ 17: పట్టణంలోని వాల్యూపిచ్ సాఫ్ట్‌వేర్ సంస్థలో జనని, నిత్య ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. సంస్థలోని ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. డాక్టర్‌లు పూజిత, సుష్మితరెడ్డి, ఆసుపత్రి అధినేత సంతోష్, సంస్థ ప్రతినిధులు ఆదర్శ్ వర్ధన్‌రాజు, హెచ్‌ఆర్ రజనీ, మేనేజర్ జయచందర్, అడ్మిన్ సుధాకర్, కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రారంభానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

బెల్లంపల్లి, ఏప్రిల్ 17: బెల్లంపల్లిలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 18,19 తేదీల్లో జరిగే ధ్వజస్తంభం ప్రారంభోత్సవానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామికి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్‌రావు,ప్రభాకర్ పటేల్, రమేష్ పటేల్, గోవర్ధన్ పాల్గొన్నారు.

వేణుగోపాలచారిని కలిసిన ఉదయ్‌కాంత్

బెల్లంపల్లి, ఏప్రిల్ 17: మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా బుధవారం హైకోర్టు న్యాయవాది, లీగల్‌సెల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టీఏ డిపార్టుమెంట్ స్టేట్ వైస్ చైర్మన్ కాంపెల్లి ఉదయ్‌కుమార్ హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అదించారు. ఆయన కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

క్రికెట్ కోచింగ్

ఏసీసీ, ఏప్రిల్ 17: హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాకారులకు ఈనెల 25 నుంచి మే 25 వరకు సమ్మర్‌క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ కోదాటి ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాలలో సమ్మర్ క్యాంపులో క్రికెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440010696లో సంప్రదించాలన్నారు.



లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నామినేషన్ల ప్రక్రియ తుదిఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈనెల18నుంచి 25వరకు జరుగనున్న నామినేషన్ల స్వీకరణను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. పెండింగ్ ఓటరునమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్నిఏర్పాట్లు చేయాలన్నారు. పోటీచేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ప్రత్యేకబృందాలను నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరివేణు, డీఆర్వో లోకేశ్వర్‌రావు,ఆర్డీవోకాశబోయిన సురేష్,డీఆర్డీవోసురేందర్ పాల్గొన్నారు.

వేసవి పూర్తయ్యే వరకు తాగునీరు సరఫరా

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: వేసవికాలం పూర్తయ్యే వరకు జిల్లావ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం నిరంతరం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో దినపత్రికల్లో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. డబోలి గ్రామ పంచాయతీలో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు పది చేతి పంపులు, 2 మోటారుతో కూడా బహిరంగ బావులు, రెండు మోటారు లేని బహిరంగ బావులు, మిషన్ భగీరథ పథకంలో 40కేఎల్ఓ.హెచ్.ఎస్ఆర్-1, 20కేఎల్-3, 10 కేఎల్-1, 5కేఎల్ జీఎల్ఆర్2 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వడ్డెరగూడతోపాటు షేకుగూడ, జాదుగూడ గ్రామాల్లో గ్రామీణ నీటిసరఫరా, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారం దిశగా అధికారులు సమన్వయంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృషి చేస్తారన్నారు.

సాగు భారం



- జిల్లాలో మొదలైన వేసవి దుక్కులు
- పెరిగిపోయిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెట్టుబడి వ్యయం అధికమవుతుండడంతో రైతుల్లో ఆందోళన

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: వ్యవసాయమే ప్రధాన జీవనధారమైన జిల్లాలో రోజురోజుకు సాగు భారం అధికమవుతోంది. యేటా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం పంటలసాగుకు చేలను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్న మయ్యారు. ప్రస్తుతం వేసవిదుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సన్నకారు రైతుపై సాగు భారం మరింత పడుతోంది. ఇంధన డిమాండ్ భారీగా పెరుగడంతో ట్రాక్టర్ల కిరాయి పెరిగి పంటలు సాగు చేయడం కష్టమవుతోందన్న అభిప్రాయలు వక్తమవుతున్నాయి. ఏటేటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నా.. దానికి అనుగుణంగా మద్దతు ధర పెరగకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

మండుతున్న ఇంధన రేట్లు.. పెరుగుతున్న అద్దెలు..

జిల్లాలో ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు ఊపందుకోవడంతో గ్రామాల్లో ట్రాక్టర్లు బిజీగా మారిపోయాయి. ఇందన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దెలను పెంచేయడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. యేటా గంటకు రూ.100నుంచి రూ.200వరకు అద్దెలను పెంచేస్తున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో తమ కేమీ గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసే విధంగా రైతులు సాగుపనుల్లో యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతి పనిని యంత్రాల సాయంతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్లతో వేసవి దుక్కులు దున్నడం, పంట చేలను చదును చేయడం, చెరువులు, కుంటల నుంచి నల్ల మట్టి, ఎరువులను తరలించడం, పత్తి కర్రను తొలగించడం లాంటి పనులు కొనసాగుతున్నాయి.

ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

చిట్ల నారాయణ, రైతు, ఆసిఫాబాద్



సాగు పనుల ధరలు రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇందన ధరలతో పాటు ఎరువులు, విత్తనాల ధరలు కూడా పెరగడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. నాలుగైదు సంవత్సరాల క్రితం వరకు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతున్నది.

యేటా రూ.లక్షల్లో భారం..

ఇందన ధరలు పెరిగిపోవడంతో జిల్లా రైతాంగంపై యేటా లక్షల రూపాయల భారం పడుతోంది. దీంతో పంటలు సాగు చేయడం కష్టమేనన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 1,19,978 మంది రైతులు ఉండగా 4,50,000ఎకరాలలో ప్రతియేటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. దుక్కి దున్నినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. నాలుగైదు సంవత్సరల క్రితం వరకు ఎకరానికి రూ.10నుంచి రూ.15వేల వరకు ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం రూ.20నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోందని రైతులు వాపోతున్నారు. దీనికితోడు కూలీల కొరతతో యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందంటున్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ఆసిఫాబాద్‌లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు



పెంచికలపేటలో సీతారాముల కల్యాణం



వాంకిడిలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17: ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ కోదండరామాలయంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఆలయంలో అర్చకులు స్వామివారి ఉత్సవవిగ్రహాలను శోభాయాత్రగా ఆసిఫాబాద్ నుంచి జన్కాపూర్ కోదండ రామాలయానికి తీసుకువెళ్లారు. పట్టణంలోని ప్రధానవీధుల గుండా హనుమాన్‌భక్తులు రామనామస్మరణతోపాటు భక్తిగీతాలు ఆలపించారు. చిన్నారులు, యువతులు కోలాటం, నృత్యాలు చేస్తూ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి వారికి పట్టువస్త్రాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు సమర్పించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారిని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, న్యాయమూర్తి అనంతలక్ష్మి, డీఎస్పీ సదయ్య దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం పద్మశాలి సేవాసంఘం, బీసీ సంక్షేమ సంఘం, గాజర్ల వెంకటేశ్వర్లు, సాయిని లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయా సంఘాల సభ్యులు, కుటుంబసభ్యులు మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో అలయకమిటీ సభ్యులు మార్కెట్ కమిటీ మాజీచైర్మన్లు మల్లేష్, వెంకన్న, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకురాలు సిద్ధంశెట్టి సుహాసిని,మహిళలు పాల్గొన్నారు.

కెరమెరి/జైనూర్/ లింగాపూర్/ తిర్యాణి/ సిర్పూర్ (యు)/పెంచికలపేట/రెబ్బెన/వాంకిడి: మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో సీతారాముల కల్యాణమహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శ్రీసీతారాముల రథాన్ని భక్తులు ఊరేగించారు. తిర్యాణి మండలంలో భక్తులకు గౌడసంఘం మంచినీటిని, ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సిర్పూర్(యు)లో ఆదిలాబాద్ బ్యాంక్ అధికారి ఆత్రం సునిల్‌కుమార్ అన్నందానం ఏర్పాటు చేశారు. వాంకిడిలో బంబార శ్రీరాముడికి జడ్పీటీసీ అజయ్‌కుమార్ కుటుంబసమేతంగా పట్టువస్త్రాలు బంగారు నగలను సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బెజ్జూరు: కల్యాణ రాముడి కల్యాణం భాజాభజంత్రీలు, మేళ తాళాల చప్పుళ్లు, వేదమంత్రోచ్చరణల మధ్య బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. బారెగూడ తదితర గ్రామాల్లో సీతాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఒక పక్క సీత, మరో పక్క రాముడు ఇరువురి పక్షాన భక్తులు పుస్తెలు, మట్టెలు అందించి తలంబ్రాలు పోశారు. బెజ్జూరులో నిర్వహించిన కల్యాణానికి మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రమాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో కూడా సీతారాములకల్యాణాన్ని నిర్వహించారు.భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కౌటాల: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంతో పాటు ప్రాణహితనది వద్ద గల కార్తీక్ మహారాజ్, తాటిపల్లి కుర్తా వద్ద సీతారాముల కల్యాణం జరిపించారు. ముఖ్యంగా తుమ్మిడి హెట్టి వద్ద ముందుగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రాణహితనదిలో తెప్పోత్సవం నిర్వహించి అనంతరం ఆలయంలో కళ్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయతీ. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఆలయ ధర్మకర్త వాసాల సత్యనారాయణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

దహెగాం: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దహెగాం, హత్ని గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కర్జవెల్లి గ్రామంలో ఓంకార ఆశ్రమం, రాధాకృష్ణ మందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం అంగరంగా వైభవంగా జరిగింది. కల్యాణానికి సీతాదేవి తరఫున, శ్రీరాముల వారి తరఫున ప్రత్యేకంగా అలంకరించిన పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కర్జవెల్లి గ్రామస్థులతో పాటు గంగాపూర్, బాలాజీఅనుకోడ, తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రాంగణమంతా భక్తులతో కిక్కిసింది. అనంతరం అన్నదానం చేశారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలో, రైల్వేస్టేషన్ రామాలయం, శివాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో మండపాలు ఏర్పాటు చేసి భాజాభజంత్రీలు, వేదండితుల మంత్రోచ్చారణలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సర్‌సిల్క్ రాంమందిర్ ఆలయంలో వేదపండితులు మహేశ్వర శాస్త్రి, శశాంక్ ద్వివేది ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఓల్డు కాలనీ, కోదండరామాలయం, ఇఎస్ఐ కాలనీలోని హనుమాన్ ఆలయంతోపాటు పలు ఆలయాల్లో అట్టహాసంగా సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ఆయావార్డుల ప్రజలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



సిర్పూర్(టి)లో సీతారాముల కల్యాణం



దహెగాంలో పాల్గొన్న భక్తులు



చింతలమానేపల్లిలో కల్యాణం



కాగజ్‌నగర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ బాబు



బెజ్జూరులో పాల్గొన్న భక్తులు



కాగజ్‌నగర్‌లో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కోనప్ప దంపతులు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

జైపూర్, ఏప్రిల్ 17: ప్లాంట్‌నిర్వహణలో, విద్యుత్ ఉత్పత్తిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ ఎస్టీపీపీని దేశంలోనే అత్యుత్తమ విద్యుత్‌ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు పేర్కొన్నారు. బుధవారం ఎస్టీపీపీలో అధికారులతో 2024-25ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్పొరేట్ అధికారులు, ఎస్టీపీపీ అధికారుల నుంచి ఉత్పత్తికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఉద్యోగి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో తమవంతు పాత్ర పోషించాలని ఆయన సూచించారు. సౌర విద్యుత్‌కేంద్రాల నిర్వహణ చూసుకుంటూ సౌరవిద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అవసరమైన ఆదేశాలు, అనుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి, అధికారులు జానకి రాం,ఫిజరాల్డ్,విశ్వనాథ్‌రాజుపాల్గొన్నారు.



ఎస్టీపీపీలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్ దంపతులు

ఎస్టీపీపీలో సీతారాముల కల్యాణం

జైపూర్ ఎస్టీపీపీలో బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణంలో సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు పాల్గొన్నారు. వేదమంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీలోని అధికారులు, కార్మికులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు సింగరేణి డైరెక్టర్ తెలిపారు. అంతకు ముందు శోభాయాత్రగా ఎస్టీపీపీకి చేరుకుని కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి, సోలార్‌జీఎం జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 17: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో గురువారం ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారని, సింగరేణి ఏరియా, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

24న జనరల్ బాడీ సమావేశం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 17: ఈనెల 24న మధ్యాహ్నం 3గంటలకు గోదావరిఖని లోని ప్రెస్‌క్లబ్‌లో టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు యూనియన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి తెలి పారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి సింగరేణిలోని 11ఏరియాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరవుతార న్నారు. అనంతరం కేంద్రకమిటీ కార్యవర్గాన్ని ఎనునకుంటామని, కార్మికుల సమస్యల పరిష్కారం, సింగరేణి పరిరక్షణకు పలు తీర్మానాలు చేస్తామని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన 'అరిగెల' బ్రదర్స్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 17: మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో సహా పలువురు నాయకులు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కొంతకాలంగా బీఆర్ఎస్‌లోని ఎమ్మెల్సీ దండేవిఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి వర్గీయులతో వీరికి పొసగడం లేదు. అలాగే టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప రాజీనామా తరువాత ఆ పదవి నాగేశ్వర రావు ఆశించినప్పటికీ జిల్లా నాయకులు ఆయనకు ఇవ్వకూడదని అధిష్టానం వద్ద చెప్పడంతో కినుక వహించి బీజేపీ లో చేరినట్లు తెలుస్తోంది. ఇదే విషయం అడగక ఎన్నో సంవత్సరాలనుంచి పార్టీ అభివృద్ధికోసం కృషి చేశానని తనకు సరైన గుర్తింపు లేకపోవడం బాధ కలిగించింద న్నారు. అరిగెల బ్రదర్స్ బీజేపీలో చేరడంతో ఆయనతో పాటు మండలంలోని వివిధగ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఆ పార్టీలో చేరారు. దీంతో మండలంలో బీఆర్ఎస్‌కు కొంతమంది మాత్రమే నాయకులు మిగిలారు. బీజేపీలో చేరినవారిలో అప్పల్లి మాజీసర్పంచ్ బాబురావు, సింగరావు పేట మాజీ సర్పంచ్ మహేష్, నాయకులు గడ్డల సురేష్, వాంకిడి నాయకులు ఉన్నారు.



కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న అరిగెల సోదరులు

జిల్లాలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: జిల్లాలో బుధవారం 44.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కాగజ్‌నగర్ మండలంలో 44.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా దహెగాంలో 43.5డిగ్రీలు, రెబ్బెనలో 43.2డిగ్రీలు, పెంచికలపేటలో 43.1డిగ్రీలు, తిర్యాణిలో 43.0డిగ్రీలు, బెజ్జూరులో 42.5డిగ్రీలు, కౌటాలలో 42.1 డిగ్రీలు, కెరమెరిలో 41.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూరు, ఏప్రిల్ 17: మండలంలోని రెబ్బెన, బెజ్జూరు సబ్ స్టేషన్‌లోని 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని ఏఈ అంజల్‌తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాలతోపాటు చింతల మానేపల్లి మండలంలోని డబ్బా, గూడెం అనుబంధ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు: సీఐ

జైనూర్, ఏప్రిల్ 17: గంజాయిని సాగుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ అంజయ్య అన్నారు. బుధవారం జైనూర్ పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలోని గౌరికోలం గూడకు చెందిన ఆత్రం భీంరావు తన ఇంట్లో ఎండిన గంజాయి మూడు కిలోలు ఉందన్న సమాచారం మేరకు సోదా చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆత్రం భీంరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.